

పత్తి కొనుగోళ్లకు 14కేంద్రాలు

సీసీఐ ఆధ్వర్యాన పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు ఉమ్మడి జిల్లాలో పద్నాలుగు కేంద్రాలను ఎంపిక చేశారు. 10లో



డీసీసీబీ ఉద్యోగులకు మెమోలు

విధులకు అనధికారికంగా గైర్హాజరై ఓ ఫంక్షన్‌లో పాల్గొన్న డీసీసీబీ ఉద్యోగులు పలువురికి మెమోలు జారీ చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం 32° / 19°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళ మంచు, చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) ఆధ్వర్యాన ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన వారు వైరాలోని లార్జ్‌సైజ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లా వాసులు కొత్తగూడెంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయా కార్యాలయాల్లో శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం ఉంటుందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

ఖమ్మం మామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన అధికారులు.. ఈ నిర్ణయం మరికొన్నాళ్లు అమల్లో ఉంటుందని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్–విజయవాడ(07755), విజయవాడ–డోర్నకల్(07756), భద్రాచలం రోడ్–విజయవాడ(07278), విజయవాడ– భద్రాచలం రోడ్(07279) రైళ్లను రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. అయితే, పనులు పూర్తికాకపోవడంతో నవంబర్ 5వ వరకు పొడిగించినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించాక నిత్య కల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూర్తిచేశారు.

ప్రజా ఆశీర్వాద సభకు సిద్ధం..

నేడు జీళ్లచెరువుకు సీఎం కేసీఆర్

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటి ఎన్నికల సభ
- ఎమ్మెల్యే కందాల ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తి
- సీఎం కేసీఆర్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి



సిద్ధమైన సభావేదిక



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లాకు గుమ్మమైన పాలేరు నుంచి గులాబీ బాస్, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల భేరి మోగించనున్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ మొదటి ఎన్నికల సభకు శుక్రవారం పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు వేదిక కానుంది. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే, పాలేరు అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ జన సమీకరణతో సభను సక్సెస్ చేయడంపై గులాబీ శ్రేణులు దృష్టి సారించగా.. నియోజకవర్గం నుంచి 80 వేల మందిని తరలిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు జరిగే ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని ప్రసంగించాక మహబూబాబాద్‌లో జరిగే సభకు బయలుదేరుతారు.

పాలేరుకు రెండోసారి

ముఖ్యమంత్రి కేసీఆర్ పాలేరు నియోజకవర్గానికి రావడం ఇది రెండోసారి. 2016లో భక్తరామదాసు ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు సీఎం హాజరయ్యారు. ఆనాడు సీఎంగా అధికారిక హోదాలో పాల్గొనగా.. ఈసారి ఎన్నికల సభకు వస్తున్నారు. పాలేరు నుంచి కాంగ్రెస్ తరుపున పొంగులేటి శ్రీనివాసరెడ్డి బరిలో నిలవడం దాదాపు ఖరారు కాగా, వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల బరిలో ఉంటానని ప్రకటించారు. ఇక బీఆర్‌ఎస్ తరుపున సిట్టింగ్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికే బీ ఫామ్ ఇవ్వడంతో హోరాహోరీ పోరు తప్పదనే సంకేతాలున్నాయి. దీంతో ఉమ్మడి ఖమ్మంలో మొదటి సభను పాలేరులోనే ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ తర్వాత మరో నాలుగు..

గతంలో రెండుసార్లు జరిగిన ఎన్నికల్లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు చేదు ఫలితాలే మిగిలాయి. ఈసారైనా అధిక స్థానాల్లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లా నేతలకు సీఎం ఇప్పటికే దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈక్రమంలోనే తొలి విడత ప్రచారంలో భాగంగా మొత్తం ఐదు సభలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటుచేశారు. పాలేరులో సభ తర్వాత వచ్చే నెల 1వ తేదీన సత్తుపల్లి, ఇల్లెందు, 5న కొత్తగూడెం, ఖమ్మంలో జరిగే సభలకు హాజరుకానున్న సీఎం కేసీఆర్.. రెండో విడతలో మిగతా నియోజకవర్గాల సభలకు వస్తారని తెలుస్తోంది.

సభకు సన్నద్ధం

పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలోని జీళ్లచెరువులో జాతీయ రహదారి పక్కన 25 ఎకరాల్లో సభకు ఏర్పాట్లు చేశారు. సుమారు ఎనభై వేల మంది హాజరైనా ఇబ్బంది లేకుండా మైదానాన్ని సిద్ధం చేశారు. సభావేదిక ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి భారీకటౌట్లు ఏర్పాటు చేయగా గురువారం రాత్రివరకు సభావేదిక, బారికేడ్ల నిర్మాణం పూర్తయింది. ఇక రహదారులకు ఇరువైపులా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటుచేశారు. సభాస్థలిని ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. కాగా, సీఎం వచ్చే హెలీకాప్టర్ కోసం హెలీప్యాడ్‌తో పాటు నేలకొండపల్లి నుంచి వచ్చే వాహనాల కోసం జీళ్లచెరువు సమీపాన, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల నుంచి వచ్చే వాహనాలకు గోపాలరావుపేట సమీపంలో పార్కింగ్ స్థలం ఏర్పాటుచేశారు. సభా ఏర్పాట్లను ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే కందాల పరిశీలించారు.

కేసీఆర్ హామీలపై ఆసక్తి..

జీళ్లచెరువు సభలో సీఎం కేసీఆర్ చేసే ప్రసంగంపై నియోజకవర్గవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. తమకు ఏ వరాలు ప్రకటిస్తారోనని అంతా ఎదురుచూస్తున్నారు. బీఆర్‌ఎస్ గెలిస్తే అమలుచేసే కొత్త పథకాలేమైనా చెబుతారా అనే అంశంపై చర్చ జరుగుతోంది. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా దళితబంధు అమలుచేయాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. దీంతో ఈ అంశంపై ప్రకటన చేస్తారనే నమ్మకంతో ఉన్నారు. ఇక నియోజకవర్గంలోని వెంకటాయపాలెం, సుబ్లేడు, బచ్చోడును కొత్త మండలాలుగా చేయాలన్న డిమాండ్‌పై కూడా హామీ వస్తుందని భావిస్తున్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించండి

- ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా అందరూ కృషి చేయాలి
- ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల విధుల్లో నియమితులైన ఉద్యోగులు సమయపాలనతో సమర్థవంతంగా నిర్వర్తించాలని.. తద్వారా ఎన్నికల సజావుగా సాగేలా కృషి చేయాని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, మార్పులకు సంబంధించి దరఖాస్తులను ఈనెల 28 లోగా పరిష్కరించాలని సూచించారు. కొత్త కోడళ్ల ఓటు ఎక్కడ ఉందో విచారించి, అత్త గారి ఊరికి మార్చుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఇప్పటి నుంచే విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు.

ఎంసీఎంసీ ద్వారా అనుమతులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే ప్రకటనలను నిరంతరం పర్యవేక్షించడమే కాక, పార్టీలకు అవసరమైన అనుమతులను జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) ద్వారా జారీచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఎంసీఎంసీ సమావేశంలో ఆయన సభ్యులకు సూచనలు చేశారు. ఆతర్వాత ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల స్ట్రాంగ్‌రూం, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేసిన సెయింట్ జోసెఫ్ స్కూల్‌ను సీపీ విష్ణు ఎస్.వారియర్, రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. భద్రత, బారికేడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేశారు.



ఈవీఎంల రిసెప్షన్ కేంద్రమైన సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అధికారులు

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల్లో పరిశీలన

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గానికి సంబంధించి పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూంను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ వారియర్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఈవీఎంల భద్రతపై సూచనలు చేసిన ఆయన 24గంటల పాటు పటిష్ట నిఘా ఏర్పాటుచేయాలని తెలిపారు. అలాగే, ఓట్ల లెక్కింపునకు గాను ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులలోని మహ్మదీయ కళాశాల భవనాలను కలెక్టర్, సీపీ పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు భద్రపర్చడానికి స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ హాళ్ల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్డీఓ విద్యాచందన, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, డీపీఓ హరికిషన్, డీఐఈఓ రవిబాబు, డీఏఓ విజయనిర్మల, డీసీఓ విజయకుమారి, ఎస్‌డీసీ రాజేశ్వరి, డీడబ్ల్యూఓ సుమతో పాటు వివిధ శాఖల అధికారులు ఎం.ఏ.గౌస్, వల్లోజి శ్రీనివాసరావు, ప్రసాద్‌రావు, గణేష్, బస్వారెడ్డి, సారంగపాణి, కృష్ణలాల్, రంజిత్, శ్రీనివాసులు, పారంగపాణి, పీ.వీ.రామకృష్ణ, అరుణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.16 కోట్ల నగదు సీజ్.. రూ.2.39కోట్లు విడుదల

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3,16,12,682 నగదును సీజ్ చేసినట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఇందుకు సంబంధించి 138 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అయితే, 123కేసుల్లో ఆధారాలు సమర్పించడంతో రూ.2,39,37,720 విడుదల చేశామని, ఇంకా 15కేసుల్లో రూ.76,74,962 నగదు తమ పరిధిలో ఉందని తెలిపారు. ఇక రూ.72,66,676 విలువైన సామగ్రి, తదితరాలను స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేయగా, రెండు కేసులు పరిష్కారమయ్యాయని కలెక్టర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

పత్తి కొనుగోళ్లకు 14 కేంద్రాలు

- సీసీఐ ఆధ్వర్యాన ఏర్పాటుకు రెడీ
- ఖమ్మం జిల్లాలో పది, భద్రాద్రి జిల్లాలో నాలుగు కేంద్రాలు



సీసీఐ కేంద్రాలకు వాహనాల్లో తీసుకొచ్చిన పత్తి (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యాన పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. ఈమేరకు ఖమ్మం జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలోని పది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తికాగానే కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. ఇప్పటికే సీసీఐ ఉన్నతాధికారులు నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలకు బయ్యర్లను ఎంపిక చేయగా, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీల సహకారంతో పత్తి కొనుగోళ్లు చేపడుతారు. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం పత్తి క్వింటాకు తేమశాతం ఆధారంగా గరిష్టంగా రూ.7,020 మద్దతు ధర నిర్ణయించింది. కానీ ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తుండడంతో సీసీఐ రంగంలోకి దిగుతోంది. ఖమ్మం జిల్లాలో 1,85,225 ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 2,00,373 ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా, రెండు జిల్లాల్లో కలిపి 2,84,990 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కాగా, సీసీఐ పత్తి కొనుగోళ్లలో రైతు ఆధార్ నంబర్ నమోదును తప్పనిసరి చేయగా, వ్యవసాయ శాఖ సదరు రైతు పంట సాగు చేసినట్లు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

ఎక్కడెక్కడంటే...

ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలోని జీఆర్ఆర్ ఇండస్ట్రీస్, పొన్నెకల్‌లోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్స్, తల్లంపాడులోని శ్రీ సాయి బాలాజీ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేపడుతారు. అలాగే, మధిర మండలం దెందుకూరులోని అమరావతి టెక్స్‌టైల్స్, మాటూరులోని మంజీత కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, ఇల్లెందులపాడులోని శ్రీ శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీస్, ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్స్, తల్లాడలోని స్టేపుల్‌రిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, కూసుమంచి మండలం జీళ్లచెర్వులోని దేదీప్య రామా కాటన్ ఇండస్ట్రీస్, తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులోని శ్రీ భాగ్యలక్ష్మీ కాటన్ ఇండస్ట్రీస్‌లో కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. ఇక ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం అప్పాయిగూడెంలోని శ్రీ లక్ష్మీప్రియ కొటెక్స్ జిన్నింగ్ మిల్‌ను కూడా భద్రాద్రి జిల్లా పత్తి కొనుగోళ్లకు కేటాయించారు. దీంతో పాటు సుజాతనగర్ మండలం దేగలమడుగులోని మంజిత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, అశ్వాపురం మండలం నెల్లిపాక బంజరలోని శ్రీ రామా కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్, బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని అనుశ్రీ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

రైతులకు అన్యాయం జరిగేలా కాంగ్రెస్ కుట్ర

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధుతోపాటు ఇతర సంక్షేమ పథకాలను నిలిపేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నేతలు వినతిపత్రం ఇవ్వడం బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. రైతులకు అన్యాయం జరిగేలా కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ కింది స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి నేతల వరకు అవాకులు చవాకులు మాట్లాడున్నారని విమర్శించారు. ఇదంతా సరిపోదన్నట్లుగా సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని యత్నించడం గర్హనీయమన్నారు. కాంగ్రెస్ హయాంలో పంటలకు విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోగా, ఎరువులు, విత్తనాల కోసం క్యూ కట్టాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ వచ్చాక వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వడంతో పాటు సరిపడా ఎరువులు, విత్తనాలు సమకూరుస్తున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దెబ్బకొట్టాలని యత్నిస్తున్న కాంగ్రెస్, బీజేపీకి వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఉప్పల వెంకటరమణ, చింతనిప్పు కృష్ణచైతన్య, డోకుపర్తి సుబ్బారావు, తాళ్లూరి జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీమయమైన జీళ్లచెరువు



జీళ్లచెరువు సభావేదిక వెళ్లే మార్గంలో ఫ్లెక్సీలు



సభ ఆవరణలో చదును చేస్తున్న దృశ్యం



బందోబస్తుపై పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

కూసుమంచి: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో శుక్రవారం జరిగే ప్రజాఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొననున్నారు. ఈమేరకు సభావేదిక సిద్ధం కాగా, అక్కడకు వెళ్లే అన్ని మార్గాల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. అలాగే, పార్టీ పతాకాలు, తోరణాలతో గులాబీమయంగా మారింది. కాగా, సభా ప్రాంగణాన్ని ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి గురువారం పరిశీలించారు. సభా వేదిక, వీఐపీల వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్ స్థలాలను వారు పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీ మాట్లాడుతూ... ప్రజా ఆశీర్వాద సభను పాలేరు ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులు పోస్టల్ ఖాతా తెరవాలి



రైతులతో ఖాతాలు తెరిపిస్తున్న డీఏఓ విజయనిర్మల

ఖమ్మంరూరల్: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అకౌంటింగ్ లింక్ లేని రైతులకు పీఎం కిసాన్ నగదు కోసం పోస్టల్ ఖాతాలు తెరవాలని డీఏఓ విజయనిర్మల సూచించారు. మండలంలోని కాచిరాజుగూడెంలో గురువారం పలువు రు రైతులతో ఖాతాలు తెరిపించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులు పోస్టల్ ఖాతా తెరిస్తే పీఎం కిసాన్‌కు సంబంధించిన నగదు జమ అవుతుందని తెలిపారు. అనంతరం మిర్చిని ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. కూసుమంచి ఏడీఏ విజయచందర్, ఏఓ వి.నాగేశ్వరరావు, ఏఈఓలు నగ్మా కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చెరువు నీటి విడుదల

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు నుంచి కొందరు అక్రమంగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో చెరువు ఇంకిపోతోంది. చెరువుమాధారం చెరువు మూడు తూములను గురువారం ఎత్తడంతో భారీగా నీరు దిగువకు వెళ్తోంది. ఈవిషయమై ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే చెరువు మాధారం చెరువు నీరు ఇంకిపోగా, ఉన్న నీటిని కూడా వదిలేయడంతో సాగు, తాగు అవసరాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. కాగా, చేపల వేట కోసమే నీరు విడుదల చేస్తున్నారా, ఇంకేదైనా కారణం ఉందా తెలియడం లేదు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈఈ మన్మధరావును వివరణ కోరగా చెరువు నీటిని అక్రమంగా విడుదల చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖమ్మంలో మేరీ మిట్టీ.. మేరీ దేశ్



ర్యాలీ తీస్తున్న విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో అర్బన్-రూరల్ బ్లాక్ స్థాయిలో గురువారం మేరీ మిట్టీ – మేరీ దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అమృత కలశ యాత్ర జరిగింది. వివిధ గ్రామాల్లో సేకరించిన మట్టితో ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించగా ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీఓలు రామకుమారస్వామి, మార్షియానా, కళాశాల ప్రిన్సిపాల్ బికుమళ్ల అరుణ్‌కుమార్, పోస్టల్ అధికారి వెంకటేశ్వరరావుతోపాటు షారూక్ ఇమ్రాన్, నాగాచారి, నాగరాజు, విష్ణు పాల్గొన్నారు.

ముదురుతున్న దారి పంచాయితీ..

నేలకొండపల్లి: మండలంలోని అజయ్‌తండాలో రహదారి పంచాయితీ రోజు రోజుకు ముదురుతోంది. అజయ్‌తండాలో ఏళ్ల తరబడిగా పొలాలకు వెళ్లే రహదారిపై గురువారం రాకపోకలు జరగనీయకుండా ముళ్ల కంచె, బండ రాళ్లను వేయడంతో రెండు వర్గాల మధ్య వివాదం జరుగుతోంది. వరి కోతలు ప్రారంభమవుతున్న తరుణంలో ఇలా దారిని మూసివేయడంతో పంట ఉత్పత్తులను ఎలా తరలించాలని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు పంచాయితీపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి సమస్యకు పరిష్కారం చూపాలని బాధిత రైతులు తహసీల్దార్ ఎస్.శ్వేతకు, ఎస్సై జి.సతీష్‌లకు ఫిర్యాదు చేశారు.

మద్యం, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట



సమావేశంలో పాల్గొన్న మూడు రాష్ట్రాల అధికారులు

అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో ఎక్సైజ్ శాఖ ఖమ్మం డీసీ జనార్దన్‌రెడ్డి

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం, నాటుసారా, గంజాయి రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బూర్గంపాడు మండలం సారపాకలో గురువారం ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎక్సైజ్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం, నాటుసారా, గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద మూడు రాష్ట్రాల అధికారులతో కలిసి తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఛత్తీస్‌గఢ్, ఏపీ అధికారులు గణేష్, జానయ్య, గజేందర్, కరంచంద్, రహీమున్నీసా, గురునాథ్ రాథోడ్, శ్రీనివాసరావు, వంశీకృష్ణ, సమర్థ్, నాగేశ్వరరావు, గౌతమ్, రతన్, ప్రసాద్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో ప్రాక్టీస్



క్రికెటర్ల ప్రాక్టీస్‌కు పూర్తయిన ఏర్పాట్లు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సిద్ధమైన అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం నుంచి ప్రాక్టీస్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోనే తొలిసారిగా అత్యాధునిక సౌకర్యాలతో రూ.70లక్షల నిధులు వెచ్చించి నెట్స్ సిద్ధం చేశారు. రెండు నెలలుగా నిర్మాణ పనులు జరుగుతుండగా తాజాగా పూర్తయ్యాయి. అయితే, ఇప్పుడు అధికారికంగా ప్రారంభించే అవకాశం లేకపోవడంతో ప్రాక్టీస్ చేసుకునేందుకు అనుమతించాలని నిర్ణయించారు. ఇక్కడ ప్రతీ క్రికెటర్‌కు బయోమెట్రిక్ సదుపాయం కల్పించగా, దీని ఆధారంగానే అనుమతిస్తారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా విరాట్‌కోహ్లి మైనపు బొమ్మ ఏర్పాటు చేయనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.డీ.మసూద్ పాషా తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా కబళించిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి, భర్తకు తీవ్ర గాయాలు



మృతి చెందిన సంధ్యారాణి



తీవ్రంగా గాయపడిన అంజయ్య

సత్తుపల్లిటౌన్: ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో భార్య మృతి చెందగా.. భర్తకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం సత్తుపల్లిలో చోటు చేసుకుంది. సత్తుపల్లి మండలం రేజర్ల ఎస్సీ కాలనీకి చెందిన తడికమళ్ల సంధ్యారాణి (28), ఆమె భర్త చిన్న అంజయ్యతో ద్విచక్రవాహనంపై సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. సంధ్యారాణికి కడుపునొప్పి వస్తుండడంతో చికిత్స చేయించుకుని తిరిగి రేజర్లకు బయలుదేరారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్దకు రాగానే ఖమ్మం నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సంధ్యారాణి అక్కడికక్కడే మృతి చెందగా.. భర్త అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, లారీ డ్రైవర్ వేగంగా వెళ్లిపోతుండడంతో స్థానికులు వెంబడించి రింగ్‌సెంటర్ వరకు అడ్డుకోగా డ్రైవర్ పరారయ్యాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉండగా సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న వీరి బంధువు రాములు రేజర్ల నుంచి సత్తుపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొనడంతో ఆయన గాయపడ్డాడు.

ఏపీ మంత్రి 'అంబటి'కి తప్పిన ప్రమాదం

సత్తుపల్లి: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు తృటిలో ప్రమాదం తప్పింది. మంత్రి రాంబాబు గురువారం రాత్రి 8 గంటల సమయాన రాజమండ్రి వైపు నుంచి ఖమ్మం వైపు కాన్వాయ్‌తో వెళ్తున్నారు. సత్తుపల్లిలో జేవీఆర్ పార్కు సమీపాన జాతీయ రహదారిపై వెళ్తుండగా, ముందు మహారాష్ట్ర నుంచి రాజమండ్రి వైపు గోధుమల బస్తాల లోడ్‌తో లారీ వెళ్తోంది. ఈక్రమాన టార్పాలిన్ చినగడమే కాక తాళ్లు విడిపోయి రెండు బస్తాలు లారీ నుంచి జారి మంత్రి ప్రయాణిస్తున్న కారుపై పడ్డాయి. దీంతో కారు స్వల్పంగా దెబ్బతినగా, ఆయన వెనుకాల మరో కారులో ఖమ్మం వెళ్లిపోయారు. కాగా, లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఫిర్యాదు మాత్రం అందలేదని సీఐ మోహన్‌బాబు తెలిపారు.

పొంగులేటి అనుచరుడి ఇంట్లో తనిఖీలు

కల్లూరు: ఎన్నికల వేళ పంపిణీ చేసేందుకు గిఫ్ట్ ప్యాక్‌లు ఉన్నాయనే ఫిర్యాదుతో అధికారులు కల్లూరులో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడైన కాటేపల్లి కిరణ్‌కుమార్ ఇంట్లో గిఫ్ట్ ప్యాక్‌లు నిల్వ చేశారని అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నోడల్ అధికారి, ఎంపీడీఓ బి.రవికుమార్, పంచాయతీ ఈఓ సీహెచ్.కృష్ణారావు సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించారు. అయితే, శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు, ఆయన కుమార్తె వివాహం సందర్భంగా ప్రజలకు ఇవ్వగా మిగిలిన కానుకలే ఉండడంతో ఎన్నికలకు సంబంధం లేదని నిర్ధారించుకున్న అధికారులు వెనుదిరిగారు.

టేకు తోటలో వ్యక్తి దారుణ హత్య

రఘునాథపాలెం: మాలధారణ చేసిన అన్న ఇరుమడి కార్యక్రమానికి వెళ్లిన ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ ఘటన రఘునాథపాలెం మండలం శివాయిగూడెం వద్ద ఖాళీ ప్లాట్లలో గురువారం జరిగింది. బాధిత కుటుంబీకుల తెలిపిన ప్రకారం.. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన బక్కా రామకృష్ణ(40) కుటుంబంతో కలిసి ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో నివాసముంటూ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. బుధవారం తన పెద్దమ్మ కుమారుడి ఇరుముడి ఉండడంతో భార్యతో కలిసి రామకృష్ణాపురం వెళ్లాడు. అక్కడకు తనతో పనులు చేసే వేపకుంట్లకు చెందిన వ్యక్తి కారులో వచ్చి రామకృష్ణను తీసుకెళ్లాడు. రాత్రయినా రామకృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందుతుండగా, గురువారం ఉదయం గ్రామానికి చెందిన సోషల్ మీడియా గ్రూపులో ఓ వ్యక్తి హత్యకు గురైనట్లు వచ్చిన ఫొటోలు చూసి రామకృష్ణగా గుర్తించారు. దీంతో ఆయన భార్య ఆదిలక్ష్మి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించింది. గ్రామం నుంచి ఓ వ్యక్తి కారులో తీసుకెళ్లినట్లు పోలీసులకు చెప్పింది. అయితే, మాయమాటలతో శివాయిగూడెం సమీపానికి తీసుకెళ్లి మద్యం తాగాక సదరు వ్యక్తి రామకృష్ణను రాళ్లతో మోది హతమార్చినట్లు తెలుస్తోంది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొండలరావు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని బైరవునిపల్లికి చెందిన లక్ష్మి(23) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఎలుకల మందు తాగింది. కాసేపయ్యాక గుర్తించిన స్థానికులు ఆమెను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ..

తల్లాడ: తల్లాడ గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్(డోజర్)ను గురువారం లారీ ఢీ కొట్టింది. మండల కేంద్రంలోని కల్లూరు రోడ్డులో చెత్తను నెట్టాక ట్రాక్టర్ మలుపు తిప్పుకొనేందుకు ఆగగా, రాజమండ్రి నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ దెబ్బతినగా, ఈఓ ఉమ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో పూజారి మృతి



హరిప్రసాద్ (ఫైల్)

వైరా: గుండెపోటుతో పూజారి మృతి చెందిన ఘటన వైరాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా గండగలపాడు సాయిబాబా దేవాలయంలో పదిహేనేళ్లుగా హరిప్రసాద్(43) పూజారిగా పనిచేస్తున్నాడు. రోజులాగే గురువారం ఉదయం ఆయన ఆలయానికి బయలుదేరుతుండగా గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడానికి యత్నిస్తుండగానే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

క్లుప్తంగా

లిఫ్ట్ పని చేస్తోంది...!



లిఫ్ట్‌లో వెళ్తున్న ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ(నేషనల్ ఇన్ఫర్‌మెటిక్ సెంటర్) ఎదుట ఉన్న లిఫ్ట్ మరమ్మతులు పూర్తిచేశారు. ఇక్కడ లిఫ్ట్ పనిచేయకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్న విషయమై 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించి అధికారులు గురువారం మరమ్మతు చేయించడంతో ఐదు రోజులుగా దివ్యాంగులు, వృద్ధులు, ఉద్యోగులు పడిన ఇబ్బందులు తొలగిపోయాయి.

విద్యార్థులు నూరుశాతం హాజరు కావాలి



ఉపాధ్యాయులకు ఎన్నికల ఉత్తర్వులను అందజేస్తున్న డీఈఓ సోమశేఖర్‌శర్మ

ఏన్కూరు: పాఠశాలకు విద్యార్థులు నూరు శాతం హాజరుకావాలని, ఈ విషయంలో ఉపాధ్యాయులు చొరవ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌శర్మ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు, బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు చేశాక, ఎన్నికల విధులకు సంబంధించి ఉత్తర్వులు అందించారు. ఎంఈఓ దుగ్గిరాల జయరాజు, హెచ్ఎం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులం ప్రిన్సిపాల్ సరెండర్

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఉజ్వలకుమారిని సంస్థ కార్యదర్శి గురువారం సరెండర్ చేశారు. గత ఏడాదిన్నర నుంచి ఆమె ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండగా.. విధుల్లో నిర్లక్ష్యం, సమయపాలన పాటించకపోవడం వంటి కారణాలతో చర్యలు తీసుకున్నారు. గురుకులాల ఆర్‌సీఓ నివేదిక ఆధారంగా ఉజ్వలకుమారిని హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో వైస్ ప్రిన్సిపాల్ ఈవూరి ప్రమీలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

డీసీసీబీ ఉద్యోగులకు మెమోలు జారీ

విధులకు గైర్హాజరై సహచర ఉద్యోగి ఇంట్లో ఫంక్షన్‌కు...

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో పనిచేసే వివిధ స్థాయి అధికారులు, ఉద్యోగులు పలువురికి గురువారం ఇన్‌చార్జ్ సీఈఓ కె.నర్మద మెమోలు జారీ చేశారు. బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఒకరు ఖమ్మంలో ఈనెల 24వ తేదీన గృహప్రవేశం చేశారు. పలువురు అధికారులు, ఉద్యోగులు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరై ఫంక్షన్‌లో పాల్గొన్నారు. ఈ విషయం తెలియడంతో పది మందికి ఇన్‌చార్జ్ సీఈఓ మెమోలు జారీ చేశారు. అయితే, సెలవులో ఉన్న కొందరికి కూడా మెమోలు జారీ అయినట్లు సమాచారం. ఈమేరకు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో సూచించారు.

బియ్యంలో పెట్టి గంజాయి రవాణా!



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ఖమ్మంక్రైం: ఇప్పటివరకు గంజాయిని వివిధ రకాలుగా రవాణా చేయడం మనకు తెలిసిందే. అయితే, ఎన్నికల వేళ స్మగ్లర్లు ఈసారి భిన్నంగా ఆలోచించారు. ఎవరికీ అనుమానం రాకుండా బియ్యంలో గంజాయిని పెట్టి తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపాన గురువారం ఎక్సైజ్ సీఐ రాజు ఆధ్వర్యాన ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ ఉద్యోగులు తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి బిందెలో బియ్యం నింపి అడుగున గంజాయి పెట్టి గోనె సంచిలో వేసుకుని తీసుకెళ్తుండగా అనుమానంతో పరిశీలించారు. దీంతో సుమారు రూ.5లక్షలు విలువైన 20 కేజీలగంజాయి లభించగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,201	6,200
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,400	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి (పాతది)	6,751	5,500
పత్తి (కొత్తది)	6,800	5,000

– ఖమ్మం వ్యవసాయం